# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్‌రాజు





# అమెరికులాసా కథ – 210
## పాత సారా, కొత్త సీసా...

కౌముది పత్రిక ఈ సంచికతో 19 ఏళ్ళు పూర్తి చేసుకుని 20వ ఏట అడుగుపెడుతున్న సందర్భంగా వ్యవస్థాపక సంపాదకులు కిరణ్ ప్రభ, కాంతి గార్లకి, ఇన్నేళ్ళగా ప్రపంచవ్యాప్తంగా ఆదరిస్తున్న పాఠకులకి, రచయితలకి ముందుగా అభినందనలతో పాటు 2026 వ నూతన సంవత్సర శుభాకాంక్షలు కూడా తెలియజేస్తున్నాను. కౌముదికి ఇది 229 వ సంచిక అయితే హాస్య కౌముదిలో ఇది నా 210 వ కథ, వ్యాసం, కథావ్యాసం..వాటెవర్. అంటే ఇంచుమించు మొదటి సంచిక నుంచీ తగుదునమ్మా అని నేను రాసి పడేస్తున్న రాతకోతల పరంపరలో 19 సార్లు 'నెల తప్పాను" అనమాట. కానీ అలా 'నెల తప్పడానికి' కారణం ప్రతీ సారీ ఒకే "తండ్రి" కారణం కాదు... కర్ణుడి చావుకి సవాలక్ష కారణాలు అయితే నాకు అప్పుడప్పుడు ఆవహించే బధ్ధకం, ఏదో ఒక సాహితీ సదస్సు నిర్వహణలో తీరుబడి లేకపోవడం...మరి కొన్నిసార్లు "ఈ సారి నా మీద ఏమైనా కూశావో వాతలు పెడతాను" అని మా క్వీన్ విక్టోరియా కూతలు కూయడం...ఇలాటి వంకలు పెట్టి రాయడం ఎగ్గొట్టడం అనమాట.

ఇక ప్రతీ ఏడు లాగానే డిసెంబర్ నెల రాగానే ఒక పక్క 'పాత రోత. కొత్త వింత" అనుకుంటూ కొత్త సంవత్సరం కోసం ఎదురు చూడడం ఒక అలవాటు అయితే 'మళ్ళీ కారు, ఇల్లు, కళ్ళు, చెవులు, ఆరోగ్యం మొదలైన ఇన్స్యూరెన్సులు అన్నీ మార్చుకోవాలో, పాతవే ఉంచుకోవాలో నిర్ణయించుకునే ఈతి బాధలు కూడా నెత్తి మీద పడతాయి. పైగా ఈ మధ్య ఎందుకో తెలీదు కానీ అదేదో దిక్కుమాలిన 'ఫ్యూనరల్ ఇన్స్యూరెన్స్" ట..అంటే 'శ్మశానం భీమా" వాళ్ళు తగులుకున్నారు నన్ను. అంటే నేను తెలిసో తెలియకో ఎప్పుడైనా పొరపాటున గడప దాటేస్తే ఆ ఖర్చులకి చెక్కు రాసి మా ఇంట్లో ఇచ్చేసే 'రిపబ్లికన్" భీమా పథకం ఒక రకం అయితే ఖర్చులు పెట్టుకోవడమే కాకుండా దండలూ, పురోహితుడూ వగైరా అన్ని ఏర్పాట్లూ చేసి తగలేసే "డెమొక్రాటిక్" పథకం మరో రకం. అవి విని, నేను గతుక్కుమని, మా డాక్టర్ ఫోన్ నెంబర్ వాళ్ళకి ఇచ్చేసి ఆ ముహూర్తం ఎప్పుడో ఆయన్ని అడగమని చెప్పాను ఆ ఇన్స్యూరెన్స్ అమ్మాయికి. అది విని ఆ అమ్మాయి గుటుక్కు మంది...సారీ ...గతుక్కు మంది.

ఇక నా మటుకు నాకు ప్రతీ ఏడూ చివరాఖరిలో ఆ ఏడు సాహిత్యపరంగా, సమాజ పరంగా, వ్యక్తిగతంగా ఏమి ఉద్ధరించానో బేరీజు వేసుకోవడం, నేను ఎంత 'తగలేశానో' లెక్కలేసుకుని జవాబు చెప్పమని ఆవిడ గిజ గిజ లాడడం ఒక రివాజు. సాహిత్య పరంగా నా లెక్కన గత ఏడాది..అంటే 2025 లో 30వ ఉగాది ఉత్తమ రచనల పోటీ, అర డజను తెలుగు పుస్తకాల ప్రచురణ, మా హ్యూస్టన్ లో రెండు రోజుల పాటు 14వ అమెరికా తెలుగు సాహితీ సదస్సు నిర్వహణ, ఆ సందర్భంగా కేలిఫోర్నియాలోని ఆరియా విశ్వవిద్యాలయం లో తెలుగు శాఖ పురోభివృద్ధి కోసం లక్ష డాలర్లతో ఒక వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా శాశ్వత ధర్మనిధి ఏర్పాటు కూడా జరిగింది. తర్వాత కాకినాడ, హైదరాబాద్ లో 'అమెరికామెడీ హాస్యనాటకోత్సవాలు" అని పెద్ద గొప్పగా పేరుపెట్టి నేను రాసిన ఐదు నాటకాలు వేయించడం కొన్ని సాహిత్య వ్యాపకాలు.

సమాజ సంక్షేమ పరంగా హైదరాబాద్, కాకినాడ, తదితర ప్రాంతాలలో పన్నెండు సేవా సంఘాలకి..అనగా బీద, బడుగు వర్గాలు, శారీరక, మానసిక వికలాంగులు, అనాధలు, వృద్ధుల సంక్షేమం కోసం నిరతరం కృషి చేస్తున్న లాభాపేక్ష లేని సంస్థలకి ఆర్ధిక సహాయం అందించడం నాకు ఎంతో సంతృపిని ఇచ్చింది. మన వ్యక్తిగత, కుటుంబ అవసరాలకి సరిపడా ధన సంపాదన, మన తర్వాత ఒకటి, రెండు తరాల వారికి తగినంత ఆర్ధిక వారసత్వానికి అవసరమైన నిధుల పోదుపు చేకూర్చడం మన ప్రథమ, ప్రధాన కర్తవ్యం అయితే, అంతకు మించిన ఆదాయం ఏదో రూపంలో సమాజం మనకి ఇచ్చినదే కదా!. మన వ్యాపార, ఉద్యోగ, సద్యోగ, సేవలకి తగిన వెల కట్టి మనకి చెల్లించిన ఆ మిగులు ధనం మనది కాదు, అది ఆ సమాజానికే చెందుతుంది అనే మౌలికమైన సూత్రాన్ని నమ్మిన వాడిని నేను. "అంటే ఏమంటావ్? మనకి కావలసినంత డబ్బు బ్యాంక్ లో ఉన్నాక, మిగతాది సమాజంలో అవసరం ఉన్న వారికి ఇవ్వాలి అంటావ్ అంతేనా?" అంటుంది మా క్వీన్ విక్టోరియా. "అవును కదా" అంటాను నేను. మరి మీరేమంటారు?

వ్యక్తిగతంగా..అంటే సొంత డబ్బా కొట్టుకునే డిపార్ట్ మెంట్ లో కూడా నేను తక్కువ "తినలేదు" అనే చెప్పాలి. ఉదాహరణకి TAL Radio లో వారి 'స్ఫూర్తి కిరణాలు' అనే విజయవంతమైన కార్యక్రమంలో (https://v1.talgiving.org/api/v1/url/tA0S6yQ5ae) ఏకంగా 13 సంచికలలో (episodes) నా జీవిత ప్రస్థానంలో కొన్ని కీలక అంశాల గురించి చెప్పే అవకాశం 2025 లోనే వచ్చింది. కౌముదిలో నా రాత కోతలు ఎంత మంది చదివారో తెలియనట్టే, ఆ రేడియో కూతలు ఎంత మంది విన్నారో కూడా నాకు తెలియదు! గీతాకారుడు అన్నట్టుగా 'మన పని మనం చేసుకుంటూ పోవడమే. చదవడం, వినడం, చూడడం కొందరి కర్మ, మరి కొందరి ఖర్మ".

కుటుంబ పరంగా 2025 లో ఏమి ఉద్ధరించానో గుర్తుకి తెచ్చుకోవాలి అంటే దానికి స్మార్ట్ ఫోన్ ఏకైక సాధనం. ఎందుకంటే రోజుకి 24 గంటలూ, 365 రోజులూ అందులో ఇంటా, బయటా ఆడుకున్న ఆటలన్నీ ఫొటోలు, వీడియోల రూపంలో కొన్నీ, వాట్సప్, ఫేస్ బుక్ తదితర రూపాలలో మొత్తం అన్నీ దాకుంటాయి. అవన్నీ చూడాలంటే ఏడాది పైనే

పడుతుంది. అంచేత విహంగ వీక్షణం చేసి నేను కనిపెట్టినది ఏమిటంటే 2025 లో నేను మొత్తం తీసిన ఫోటోలు 4,875 అయితే వీడియోలు కేవలం 397 మాత్రమే! వాటి వి.వీ..అంటే విహంగ వీక్షణం చేస్తే తెలిసిన విషయాలలో ముఖ్యమైనవి చాలానే ఉన్నాయి. ఉదాహరణకి ఈ ఏడు..అంటే 2025 జనవరిలో...మా రెండో అమ్మాయి ద్వారా మాకు రెండో మనవడు పుట్టాడు. వాడితోటీ, ఇద్దరు మనవరాళ్ళతోటీ ఆడుకోడానికి ఏడాదిలో ఐదు సార్లు డాలస్ వెళ్ళగా, నేను ఒక సారి ఇండియా వెళ్ళినప్పుడు బంధు మిత్ర సమేతంగా అందరూ నాతో 'చెడుగుడు' ఆడుకున్నారు. ఇక మా బాక్ యార్డ్ లో అంతకు ముందుటేడు తుఫానుకి కూలిపోయిన పాటియో స్థానంలో కొత్త పందిరి వేయించుకోడానికి, పాడయిపోయిన నీళ్ళ కుంపటి..అంటే వాటర్ హీటర్ పీకించేసి కొత్తది వేయించుకోడానికీ మా తాతలు దిగి వచ్చారు. మరొక ముఖ్యమైన విషయం మా పెద్దమ్మాయి స్వంతంగా తన మెడికల్ క్లినిక్ మొదలు పెట్టింది. అది మా ఇంటికి దగ్గరలో ఉంది కాబట్టి ఇల్లు కూడా దగ్గర్లోనే కొనుక్కుందాం అని 25 మైళ్ళ దూరంలో ఉన్న ఇల్లు అమ్మకానికి పెట్టగానే అది రకీమని అమ్ముడయిపోయింది. కొత్త ఇల్లు కొని కట్టించుకోడానికి ఆరు నెలలు పడుతుంది అని తెలియగానే మా పెద్దమ్మాయి, అమెరికన్ అల్లుడూ, రెండేళ్ళ మా పెద్ద మనవడూ, వాళ్ళ బుజ్జి కుక్కా....అందరూ హాయిగా మా ఇంట్లోనే ఆరు నెలలూ ఉండి మమ్మల్ని మహదానంద పెట్టారు. అమెరికాలో ఇలా అందరూ ఒకే ఇంట్లో ఉండి, మాలాగా రోజూ మనవడితో ఆడుకునే అదృష్టం ఎంత మందికి వస్తుంది చెప్పండి. ఇప్పుడు...అంటే జనవరి 2026 మొదటి వారానికి ఆ కొత్త ఇల్లు పూర్తి అయి వాళ్ళు గృహ ప్రవేశం చేసి వాళ్ళింటికి వాళ్ళు వెళ్ళిపోయారు. ఇల్లు ఖాళీ అయిపోయింది...నేనూ, ఆవిడా తప్ప. ఇలా 2025 లో చెప్పడానికి చాలానే ఉన్నాయి. అన్నట్టు మర్చే పోయాను....2025 లోనే పానకంలో పుడకలాగా చెప్పా పెట్టకుండా నా 80వ పుట్టిన రోజు వచ్చి, వెళ్ళిపోయింది. పోతే పోనివ్వండి. మళ్ళీ ఇంకోటి వస్తుందిగా...ఇదిగో ఇలా 2025 వెళ్ళి పోయి 2026 రాలేదూ..అలాగనమాట. మధ్యలో మా డాక్టర్లు సరదా పడుతుంటే ఒకటి, రెండు సార్లు ఆసుపత్రికి కూడా వెళ్ళి పాత వ్యధలకి కొత్త నివారణలు చేయించుకుని వచ్చాను...ఇలా కొత్త సీసాలో పాత సారా పోసేస్తూ, పాతా కొత్తా కలిపేస్తూ కాలంతో పాటు మనమూ కాలక్షేపం చేసేద్దాం. ఏమంటారు?

**COMMENTS**